## ఆసీస్ మాజీలను సంప్రదించలేదు: జై షా

ముంబై: టీమిండియా ప్రధాన కోచ్ పదవి కోసం ఆస్ట్రేలియా మాజీ ఆటగాళ్లు జస్టిన్ లాంగర్, రికీ పాంటింగ్‌ను బీసీసీఐ సంప్రదించిందని వస్తున్న వార్తలన్నీ పుకార్లేనని బోర్డు కార్యదర్శి జై షా స్పష్టం చేశాడు. శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో జై షా స్పందిస్తూ.. 'భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్ పదవి కోసం నేను గానీ, బీసీసీఐ గానీ ఏ ఒక్క ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్‌ను సంప్రదించలేదు. మీడియాలో వస్తున్న వార్తలన్నీ నిరాధారం. టీమిండియాకు హెడ్‌కోచ్‌ను ఎంపిక చేయడం సమగ్రమైన ప్రక్రియ. భారత క్రికెట్ గురించి లోతైన అవగాహన ఉన్న కోచ్‌పై మేము దృష్టిసారించాం' అని పేర్కొన్నాడు.




భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్న స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్

## బంగ్లాకు అమెరికా షాక్

### 2-0తో సిరీస్ కైవసం

హోస్టన్: సొంతగడ్డపై త్వరలో జరుగబోయే టీ20 వరల్డ్ కప్‌నకు ముందు ఆతిథ్య యూనైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా (యూఎస్‌ఏ) సంచలన విజయాలతో దూసుకెళ్తోంది. అంతర్జాతీయ స్థాయిలో అనుభవమున్న బంగ్లాదేశ్‌ను వరుసగా రెండు మ్యాచ్‌లలో ఓడించి మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో కైవసం చేసుకుంది. హోస్టన్ వేదికగా గురువారం రాత్రి బంగ్లాదేశ్‌తో ముగిసిన రెండో టీ20లో ఆ జట్టు 6 పరుగుల తేడాతో నెగ్గింది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన అమెరికా 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేయగా ఛేదనలో బంగ్లా 138 పరుగులకే ఆలౌట్ అయింది.

స్పిన్ ఉచ్చులో రాజస్థాన్ చిత్తు

# ఫైనల్లో హైదరాబాద్

క్వాలిఫయర్-2లో ఘనవిజయం

**షాబాజ్, అభిషేక్ మాయాజాలానికి రాయల్స్ 'ఖేల్' కతం • రాణించిన క్లాసెన్, త్రిపాఠి**

**ఆరేండ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. సీజన్ ఆసాంతం సంచలన విజయాలతో రికార్డు స్కోర్లతో దుమ్మురేపిన ఎస్ఆర్‌హెచ్.. చెన్నైలోని చెపాక్ వేదికగా 'క్వాలిఫయర్-2'లో రాజస్థాన్ రాయల్స్‌ను స్పిన్ ఉచ్చులో బంధించి కోల్‌కతాతో ఫైనల్ పోరుకు రంగం సిద్ధమైంది. బ్యాటింగ్‌లో క్లాసెన్, త్రిపాఠి తప్ప మిగిలినవాళ్లు విఫలమైనా రెండో ఇన్నింగ్స్‌లో పిచ్ స్వభావాన్ని అర్థం చేసుకున్న హైదరాబాద్.. యువ స్పిన్నర్లతో రాయల్స్‌ను దెబ్బతీసింది. షాబాజ్, అభిషేక్ మాయాజాలానికి శాంసన్ సేనకు మరోసారి నిరాశే ఎదురైంది. ఐపీఎల్ ఫైనల్‌లో కేకేఆర్-ఎస్ఆర్‌హెచ్ తలపడనుండటం ఇదే ప్రథమం.**




చెన్నై: ఎన్నాళ్లకెన్నాళ్లకు..! ఐపీఎల్-17లో అందరి అంచనాలను తలకిందులు చేస్తూ సంచలన విజయాలతో ప్లేఆఫ్స్‌కు చేరిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. కీలకమైన 'క్వాలిఫయర్-2'లో భాగంగా చెపాక్ వేదికగా శుక్రవారం రాజస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 36 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో ఆదివారం అమీతుమీకి సిద్ధమైంది. బ్యాటింగ్‌లో స్థాయికి తగ్గ ప్రదర్శన చేయకపోయినా స్పిన్‌కు అనుకూలించే చిదంబరం స్టేడియంలో రాజస్థాన్‌ను తిప్పేసింది. షాబాజ్ అహ్మద్ (3/23), అభిషేక్ శర్మ (2/24) స్పిన్ మాయాజాలానికి రాయల్స్ దాసోహమైంది. హైదరాబాద్ నిర్దేశించిన 176 పరుగుల ఛేదనలో శాంసన్ సేన.. 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 139 పరుగులకే పరిమితమైంది. ధ్రువ్ జురెల్ (35 బంతుల్లో 56 నాటౌట్, 7 ఫోర్లు, 2 సిక్సర్లు) ఒంటరిపోరాటం చేశాడు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్.. హెన్రిచ్ క్లాసెన్ (34 బంతుల్లో 50, 4 సిక్సర్లు), రాహుల్ త్రిపాఠి (15 బంతుల్లో 37, 5 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించడంతో 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. షాబాజ్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

### సంజూ వ్యూహంలో చిక్కి..

కోల్‌కతాతో క్వాలిఫయర్-1 మాదిరిగానే రాజస్థాన్‌తోనూ ఎస్ఆర్‌హెచ్‌కు శుభారంభం దక్కలేదు. బౌల్ట్ తొలి ఓవర్లోనే అభిషేక్ శర్మ(12)ను ఔట్ చేసి హైదరాబాద్‌కు షాకిచ్చాడు. కానీ వన్ డౌన్‌లో వచ్చిన రాహుల్ త్రిపాఠి ధాటిగా ఆడాడు. మరో ఎండ్‌లో హెడ్ ఉన్నప్పటికీ త్రిపాఠి.. అశ్విన్ 4వ ఓవర్లో 4,4,6తో రెచ్చిపోయాడు. బౌల్ట్ 5వ ఓవర్లోనూ 6,4 బాదడంతో అతడు వ్యూహం మార్చి స్లో బౌన్సర్‌గా వేసిన మూడో బంతిని థర్డ్ మ్యాన్ దిశగా ఆడగా.. అక్కడే ఉన్న చాహల్ క్యాచ్ పట్టడంతో త్రిపాఠి కథ ముగిసింది. మార్క్‌రమ్ (1) సైతం ఇదే ఓవర్లో చివరి బంతికి షార్ట్ థర్డ్ మ్యాన్ వద్దే చాహల్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ట్రావిస్ హెడ్ (28 బంతుల్లో 34, 3 ఫోర్లు, 1 సిక్స్) గేర్ మార్చే దిశగా సాగుతుండగా శాంసన్.. త్రిపాఠిని ఔట్ చేయడంలో పాటించిన వ్యూహాన్నే ఇక్కడా అమలుచేశాడు. 10వ ఓవర్లో సందీప్ శర్మతో స్లో బంతిని వేయించి టెంప్ట్ చేశాడు. ఆఖరు బంతికి షార్ట్ థర్డ్ మ్యాన్ దిశగా ఆడబోయి అక్కడే ఉన్న అశ్విన్‌కు క్యాచ్ ఇచ్చి నిరాశగా వెనుదిరిగాడు. నితీశ్ రెడ్డి (5) సైతం ఇదే వ్యూహంలో చిక్కి విలవిల్లాడాడు.

### ఆదుకున్న క్లాసెన్

99 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన హైదరాబాద్‌ను క్లాసెన్ ఆదుకున్నాడు. ఆరంభంలో ధాటిగానే అతడు తర్వాత వచ్చినవాళ్లు వచ్చినట్టు డగౌట్‌కు వెళ్తుండటంతో అతడు నెమ్మదించాడు. చాహల్‌ను లక్ష్యంగా చేసుకుని చూడచక్కని సిక్సర్లు బాదిన క్లాసెన్.. బౌల్ట్ 18వ ఓవర్లో సింగిల్ తీసి 33 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తిచేశాడు. కానీ సందీప్ శర్మ 19వ ఓవర్లో తొలి బంతికే క్లీన్ బౌల్డ్ అయ్యాడు. క్లాసెన్ పోరాటంతో హైదరాబాద్ పోరాడే స్కోరును సాధించింది.

### రాయల్స్‌ను తిప్పేసిన స్పిన్నర్లు

ఛేదనను రాజస్థాన్ నెమ్మదిగానే ఆరంభించింది. క్రీజులో నిలిచేందుకు తంటాలుపడ్డ ఓపెనర్ టామ్ కోహ్లర్ (10)ను కమిన్స్ 4వ ఓవర్లో ఔట్ చేసి సన్‌రైజర్స్‌కు తొలి బ్రేక్ ఇచ్చాడు. కానీ సారథి సంజూ శాంసన్ (10)తో జతకలిసిన జైస్వాల్.. భువీ వేసిన 6వ ఓవర్లో 6,4,4,4తో దంచి స్కోరు వేగాన్ని పెంచే యత్నం చేశాడు. పవర్ ప్లే గా ముగియగానే 8వ ఓవర్లోనే కమిన్స్.. లెఫ్టార్మ్ స్పిన్నర్లు షాబాజ్, అభిషేక్‌ను రంగంలోకి దించి రాయల్స్‌ను మడతపెట్టేశాడు. షాబాజ్ వేసిన 8వ ఓవర్లో భారీ షాట్ ఆడబోయిన జైస్వాల్.. లాంగాఫ్ వద్ద సమద్‌కు క్యాచ్ ఇచ్చాడు. అభిషేక్ 9వ ఓవర్లో శాంసన్ కూడా పుల్‌షాట్ ఆడబోయి లాంగాన్ వద్ద మార్క్‌రమ్ సూపర్ క్యాచ్‌తో పెవిలియన్ చేరాడు. స్పిన్నర్లు వికెట్లు తీయడంతో పాటు పరుగులను నియంత్రించడంతో ఒత్తిడికి గురైన పరాగ్ (6).. షాబాజ్ 12వ ఓవర్లో అభిషేక్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఇదే ఓవర్లో నాలుగో బంతికి అశ్విన్ డకౌట్ అయ్యాడు. రాజస్థాన్ భారీ ఆశలు పెట్టుకున్న హెట్‌మెయర్ (4)ను అభిషేక్ బౌల్డ్ చేయడంతో ఆ జట్టు పీకల్లోతు కష్టాల్లో పడింది. పావెల్ (6)ను నటరాజన్ పెవిలియన్ చేర్చడంతో రాయల్స్ ఓటమి ఖారారైంది. ఆఖర్లో జురెల్ మెరుపులు మెరిపించినా అతడి పోరాటం రాయల్స్‌ను గట్టెక్కించలేకపోయింది.

**3** **2018 తర్వాత ఐపీఎల్ ఫైనల్స్‌కు వెళ్లడం సన్‌రైజర్స్‌కు ఇదే మొదటిసారి. మొత్తంగా మూడోసారి.**

### సంక్షిప్త స్కోర్లు

హైదరాబాద్: 20 ఓవర్లలో 175/9 (క్లాసెన్ 50, రాహుల్ 37, అవేశ్ 3/27, బౌల్ట్ 3/45). రాజస్థాన్: 20 ఓవర్లలో 139/7 (జురెల్ 56 నాటౌట్, జైస్వాల్ 42, షాబాజ్ 3/23, అభిషేక్ 2/24)

## సెమీస్‌కు సింధు



కౌలాలంపూర్: మలేషియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో తెలుగమ్మాయి పీవీ సింధు జోరు కొనసాగుతోంది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో సింధు 21-13, 14-21, 21-12తో టాప్‌సీడ్ చైనా అమ్మాయి హాన్ యూపై కష్టపడి గెలిచింది. 55 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో హాన్‌ను చిత్తు చేయడంతో గత నెల ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఓటమికి సింధు బదులు తీర్చుకున్నట్టైంది. మరో క్వార్టర్స్‌లో అష్మిత చాలిహా 10-21, 15-21తో చైనాకే చెందిన జంగ్ యి మన్ చేతిలో వరుస గేమ్‌లలో ఓడింది. అష్మిత సైతం ఓడటంతో ఈ టోర్నీలో భారత్ నుంచి సింధు మాత్రమే పోటీలో ఉంది.

## ఆర్చరీలో మరో పతకం ఖాయం



యోచియోన్: ఆర్చరీ వరల్డ్ కప్ గ్రూప్ స్టేజ్-2లో భారత్‌కు మన ఆర్చర్లు మరో పతకం ఖాయం చేశారు. కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో జ్యోతి సురేఖ, ప్రియాన్ష్ ఫైనల్‌కు దూసుకెళ్లడంతో భారత్ ఖాతాలో మరో పతకం చేరినట్టైంది. సెమీస్‌లో భారత జోడీ 158-157తో కొరియాకు చెందిన హాన్ సుయింజియోన్, యంగ్ జేవొన్‌ను ఓడించి ఫైనల్స్‌కు అర్హత సాధించారు. శనివారం జరుగబోయే తుది పోరులో భారత ద్వయం యూఎస్ఏ ఆర్చర్లు ఒలివియా డీన్-సవ్యైర్‌ను ఢీకొననున్నారు. ఈ టోర్నీలో భారత మహిళల కాంపౌండ్ జట్టు ఇది వరకే ఫైనల్ చేరిన విషయం విదితమే. సీనియర్ ఆర్చర్ దీపికా కుమారి, ప్రథమేశ్ సైతం సెమీస్ చేరుకున్న నేపథ్యంలో వీరిపైనా భారీ ఆశలున్నాయి.

## హార్దిక్, స్టాన్‌కోవిచ్ ఎడబాటు!



ముంబై: ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యాను కష్టాలు నీడలా వెంటాడుతూనే ఉన్నాయి. పేలవ కెప్టెన్సీతో మాజీ చాంపియన్ ముంబై ఇండియన్స్ ప్లేఆఫ్స్ చేరకుండానే లీగ్ దశలోనే నిష్క్రమించగా, పాండ్యా వైవాహిక జీవితంలో ఒడిదొడుకులు ఎదుర్కొంటున్నట్లు తెలిసింది. పాండ్యాతో అతని భార్య సెర్బియాకు చెందిన నటాషా స్టాన్‌కోవిచ్ విడిపోయినట్లు 'రెడిట్' చేసిన పోస్ట్ సోషల్‌మీడియాలో ప్రస్తుతం వైరల్‌గా మారింది. 2020లో ఈ జోడీ పెండ్లి చేసుకోగా, ఇద్దరికి బాబు(ఆగస్త్య) పుట్టాడు. అయితే అధికారికంగా విడిపోయినట్లు వెల్లడి కానప్పటికీ సోషల్‌మీడియాలో ఇద్దరు ఒకరినొకరు అన్‌ఫాలో అయ్యారు. ఇన్‌స్టాగ్రామ్‌లో నటాషా తన పేరు పక్కన పాండ్యాను తీసేసింది. దీనికి తోడు పాండ్యాతో కలిసి ఉన్న ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్ నుంచి తొలిగించినట్లు తెలుస్తున్నది.

## రింకూకు మూడో స్థానం



కోబ్: ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రింకూ హుడా ఆకట్టుకున్నాడు. శుక్రవారం జరిగిన పురుషుల ఎఫ్46 జావెలిన్ త్రో విభాగంలో రింకూ మూడో స్థానంలో నిలిచాడు. నాలుగో రౌండ్‌లో రింకూ 62.77మీటర్ల దూరం విసిరి టాప్-3లో చోటు దక్కించుకున్నాడు. అయితే రెండో స్థానంలో నిలిచిన ప్రియాంత హెరాత్ (64.59మీ)..టాప్‌లో ఉన్న గులెర్మో వెరోనా గొంజాలెజ్(65.61మీ)పై ఫిర్యాదు చేశాడు. దీంతో అధికారిక ఫలితాలు వెల్లిండించకుండా నిలిపివేశారు. ఇదిలా ఉంటే భారత్ గత రికార్డులను తిరగరాస్తూ ప్రస్తుతం 12 పతకాల(5స్వర్ణాలు, 4రజతాలు, 3 కాంస్యాలు)తో కొనసాగుతున్నది.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.